


# అదీ అసలు సంగతి.

కలపర్తి సత్యం

సినిమా రంగానికి చెందిన సాంకేతిక నిపుణులు హఠాత్తుగా సమ్మె చేయడం ప్రారంభించడంతో గత వారంరోజులుగా ఏ సినిమా షూటింగూ జరగడంలేదు. పెద్దపెద్ద హీరోలు, హీరోయిన్‌లు, దర్శకులు ఇంట్లో కూర్చుని గోళ్లు గిల్లుకుంటున్నారు.

హఠాత్తుగా ఆ రోజు ఉదయం మామూలుగా ఆరుగంటలకల్లా మెలకువ వచ్చేసింది కొత్త నటి చాందినికి. గబుక్కున లేవబోయి, అంతలోనే సమ్మె సంగతి గుర్తుకొచ్చి తాపీగా లేవచ్చులే అనుకుని మళ్లీ నిద్రపోవడానికి ట్రైచేసింది. కానీ ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. విసుగొచ్చి లేచి కూర్చుని ఎలా కాలక్షేపం చెయ్యాలా ఈ రోజంతా అని తీవ్రంగా ఆలోచించసాగింది.

చాందిని అసలు పేరు ఆండాళ్. సినిమాల్లోకి ప్రవేశిస్తూ తన పేరును చాందినిగా మార్చుకుంది. ఆండాళ్‌గా ఉన్న రోజుల్లో ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పాచిపని చేసుకుని బతికేది. కాస్త అందగత్తె కావడం, అందులోనూ పద్దెనిమిదేళ్ల వయస్సు కావడంలో కుర్రకారు వెంటపడేవారు. 'రంభా, ఊర్వశి, మేనకా" అంటూ కొంతమంది వెంటపపడితే, మరికొందరు నువ్వు అచ్చం మాధురీ దీక్షిత్‌లా నవ్వుతావ్, శ్రీదేవిలా కులుకుతావ్, హేమమాలినిలా అందంగా ఉంటావు, టాబూలా నడుస్తావు అంటూ తెగ పొగిడేస్తూ ఆమెకోసం, ఆమె ప్రేమకోసం, పొందుకోసం

తహతహలాడిపోయేవారు. దాంతో ఆమెకు తన అందంపై అతి నమ్మకం ఏర్పడి ఓ శుభముహూర్తాన చెన్నై ట్రైన్ ఎక్కేసింది. అదృష్టం కలిసిరావడంతో ఓ హింద్, నాలుగు తమిళం, అరడజను తెలుగు సినిమాల్లో యాక్షన్ చేసేసింది. ప్రస్తుతం ఆమె పన్నెండో పిక్చర్ 'నీ మొగుడే నా ప్రియుడు' చిత్రంలో నటిస్తోంది. అదీ క్లుప్తంగా ఆమె ఫ్లాష్‌బాక్. ప్రస్తుతం ఆమె హైదరాబాదులో ఉంటోంది.

తీవ్రంగా ఆలోచిస్తున్న అండాళ్ (సారీ ...) చాందినికి ఓ అద్భుతమైన ఆలోచన వచ్చింది. సరదాగా అన్ని చోట్లకీ వెళ్లి షాపింగ్ చేస్తుంటే ఆ షాపు వాళ్లు తనను గుర్తించి ఉచితంగా వస్తువులు పాక్ చేసి ఇస్తారు. కారు దగ్గరకు వచ్చేసరికి అభిమానులు గుంపులు గుంపులు ఏర్పడి తన షేక్‌హేండ్‌కోసం, చిరునవ్వుకోసం ఆటోగ్రాఫ్‌లు కోసం ఎగబడతారు. ఫలానా సినిమాలో మీరు బాగా చేశారు అని పొగుడుతూ జిందాబాద్‌లు పలుకుతారు. ఓహ్ ... ఈ ఆలోచన అద్భుతంగా ఉంది. అలా షాపింగ్‌కు వెళ్లినందువల్ల జనాల్లో తన ఇమేజ్ ఎంతుందో తెలుస్తుంది. పైగా, కాస్త గర్వంగా కూడా ఉంటుంది. అంతే! ఆలోచన వచ్చిన మరుక్షణం హుషారుగా లేచి బాత్రూమ్‌వైపు కదిలింది. అరగంట తర్వాత బయటకు వచ్చి మేకప్ అయి, షాపింగ్‌కు బయలుదేరింది.

***

హొయలుపోతూ కారు దిగింది చాందిని. తాను కట్టుకున్న పదివేల రూపాయల పట్టుచీరను ఒకసారి సరిచేసుకుని చుట్టూ చూసింది. రోడ్డు మీద వెళ్తున్న జనాలు ఆమెను ఓసారి చూసి తిరిగి ఎవరి దోవన వారు వెళ్లిపోతున్నారు. ఆశ్చర్యం వేసిందామెకు. ఇదేమిటీ తనను గుర్తుపట్టలేదా జనాలు అనుకుని, సరేలే, ముందు ఈ బంగారు నగల షాపులోకి వెళ్దాం అనుకుని షాపులోకి వెళ్లింది.

షాపు చాలా పెద్దది. దాదాపు ఇరవైమంది స్టాఫ్ ఉన్నారు. అందరూ వయస్సులో ఉన్నవారే. ఆడాళ్లు, మగాళ్లు కూడా ఉన్నారు. ప్రొప్రయిటర్ దగ్గరనుండి స్టాఫ్ వరకూ అందరూ ఓసారి ఆమెను చూసి తిరిగి తమ పనిలో నిమగ్నమయ్యారు. షాపులో కస్టమర్లూ అదే తీరు.

ఆశ్చర్యం వేసింది చాందినికి. ఇదేమిటీ, వీళ్లు తనని గుర్తుపట్టలేదా? ఎందుకని? తను ఫుల్ మేకప్‌లోనే వచ్చిందే ... అనుకుని, డైరెక్ట్‌గా ప్రొప్రయిటర్ దగ్గరకు వెళ్లింది. "మంచి డైమండ్ నెక్లెస్ చూపించండి!" అడిగింది.

"ఎంతలో కావాలి?" అడిగాడు ప్రొప్రయిటర్ చాలా నిర్లక్ష్యంగా.

ఆమెకు ఆశ్చర్యం వేసింది. అయినా తమాయించుకుని, "రెండు మూడు లక్షలు ఖరీదు చేసేది!" చెప్పింది.

వరుసగా నాలుగైదు రకాలు చూపించాడు ప్రొప్రయిటర్. అందులో తనకు కావాల్సింది ఎన్నుకుని పాక్‌చేయమంది. పది నిమిషాల్లో పాకెట్ రెడీ అయింది. చెక్‌బుక్ తీసి మూడు లక్షలకు చెక్కు రాసి ప్రొప్రయిటర్ చేతికి ఇవ్వబోయింది.

"ఏంటమ్మా ఇది?" అడిగాడతను.

"మూడు లక్షలకు చెక్కు!"

"సారీ అమ్మా, తెలియనివాళ్ల దగ్గర చెక్కులు తీసుకోము!"

దాంతో ఆమెకు తిక్కరేగింది. "ఏమిటీ, నేను మీకు తెలియదా? నేను సినిమా హీరోయిన్ చాందినిని!" చెప్పిందామె కోపంగా.

బిగ్గరగా నవ్వాడు ప్రొప్రయిటర్. "చాల్లే, ఊరుకోవమ్మా! నువ్వు సినిమా హీరోయిన్ చాందినివా? నా చెవిలో పువ్వులు పెడుతున్నావా? ఒరేయ్...!" అని తన స్టాఫ్‌ని పిలిచి, "ఈవిడ సినిమా హీరోయిన్ చాందిని అంట్రా!" అంటూ బిగ్గరగా నవ్వాడు.

అక్కడ స్టాఫ్‌తోబాటు ఉన్న కస్టమర్స్ కూడా గొల్లున నవ్వారు.

"చూడబోతే గొప్పింటి పిల్లలా ఉంది. కొంపదీసి పిచ్చిదేమో!" ఎవరో అన్నారు. మళ్లీ నవ్వులు

"ఈ మధ్య ఆడాళ్లు కూడా అందంగా మోసం చేస్తున్నారు. ఈవిడా ఆ రకమేనేమో!" మళ్లీ ఎవరో కామెంట్ విసిరారు. మళ్లీ నవ్వులు, అనుమానపు చూపులు.

చాందినికి అవమానంతో కళ్లు ఎరుపెక్కాయి. శరీరం వణకసాగింది. అవమానభారంతో తల వంచుకుని చకచకా బయటకు వచ్చేసి కారెక్కి స్టార్ట్ చేసి ముందుకు పోనివ్వబోయింది.

సరిగ్గా అదే సమయంలో ఎదురుగా క్లాత్ స్టోర్స్ కనిపించింది. కారాపి దిగింది.

ఆమెకు చాలా ఆశ్చర్యంగానూ, అవమానంగానూ ఉంది. తెరమీద తను కనిపించగానే యువకులంతా ఉత్సాహంగా లేచి డాన్స్ చేస్తారని పత్రికల్లో చదివింది. ఎందరో చెప్పగా విన్నది. అక్కడకీ తను ఫుల్ మేకప్‌లోనేగా బయటకు వచ్చింది ...! మరెందుకు తన నెవరూ గుర్తుపట్టడంలేదు? ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. లాస్ట్ అండ్ ఫైనల్‌గా ఎదురుగా ఉన్న క్లాత్ స్టోర్‌లోకి వెళ్లి తన ఇమేజ్‌ని, అదృష్టాన్నీ పరీక్షించుకోవాలనుకుంది.



కారుని అక్కడే వదలి రోడ్డు దాటి క్లాత్ స్టోర్‌లోకి ప్రవేశించింది.

రోడ్డు దాటుతున్నంతసేపూ తన నెవరన్నా గుర్తుపడతారేమోనని ఆశగా చూసింది. ఊహుఁ... ఎవరూ అసలు పట్టించుకోలేదు. ఆమెకు పిచ్చెక్కినంత పనయింది. నిజంగా తను సినిమా హీరోయిన్ చాందిని కాదా? అలా అయినట్లు తను కలగంటోందా, లేక వీళ్లు నిజంగా తనను గుర్తుపట్టడంలేదా? ... ఒళ్లు జలదరించింది భయంతో.

క్లాత్ షోరూంలోకి అడుగు పెట్టగానే ఇందాక జరిగిన అవమానం గుర్తొచ్చి ఎందుకైనా మంచిదని డైరెక్ట్‌గా ప్రొప్రయిటర్ దగ్గరకు వచ్చింది.

"నమస్తే!" చెప్పింది.

బిల్స్ లెక్క చూసుకుంటూ బిజీగా ఉన్న ప్రొప్రయిటర్ ఓసారి తలెత్తి, "నమస్తే, చెప్పండి!" అన్నాడు చాలా మామూలుగా.

**'సో, వీడూ నన్ను గుర్తుపట్టలేదన్నమాట!' అని మనసులో అనుకుంటూ, "నా పేరు చాందిని. సినిమా హీరోయిన్‌ని. మీకు తెలిసే ఉంటుంది!" అంది మనసులో భయంగా ఉన్నా బింకంగా.**

**"ఒరే...! ఎవర్రా అక్కడ? ఈ పిచ్చిదాన్ని బయటకు గెంటండి!" కోపంగా అరిచాడు ప్రొప్రయిటర్.**

'సో, వీడూ నన్ను గుర్తుపట్టలేదన్నమాట!' అని మనసులో అనుకుంటూ, "నా పేరు చాందిని. సినిమా హీరోయిన్‌ని. మీకు తెలిసే ఉంటుంది!" అంది మనసులో భయంగా ఉన్నా బింకంగా.

"ఒరే...! ఎవడ్రా అక్కడ? ఈ పిచ్చిదాన్ని బయటకు గెంటండి!" కోపంగా అరిచాడు ప్రొప్రయిటర్.

బిత్తరపోయింది చాందిని. ఇందాకటి అవమానం కన్నా, ఈ పరాభవం భరించలేకపోయింది. అయినా లేని ధైర్యాన్ని కూడగట్టుకుంటూ, "ఏయ్, మిస్టర్ పిచ్చిదీ గిచ్చిదీ అనకు నేను నిజంగానే సినీ హీరోయిన్ చాందినిని!" చెప్పింది గట్టిగా అరిచి.

"ఏరా ... ఆ గార్డుగాడు ఎక్కడ చచ్చాడు? ఇంకా దేభ్యముఖం వేసుకుని అలా చూస్తారేంట్రా ...! దీన్ని బయటకు గెంటక?" బిగ్గరగా అరిచాడు.

"నిజంగానే నేను చాందినిని!" దీనంగా అంది.

"ఇన్నారా...! ఇది సినిమా ఈరోయిన్ చాందిని అంట!" బిగ్గరగా అన్నాడు.

యథాప్రకారం స్టాఫ్‌తోబాటు కస్టమర్స్ కూడా నవ్వారు.

"ఏయ్! బాహర్ చలో!" అంటూ చేతిలో కర్ర ఊపుతూ వచ్చాడు గేట్‌మెన్.

ఆమె అక్కడనుంచి కదలలేదు. డీప్ షాక్‌లో అలాగే స్థాణువులా ఉండిపోయింది. గేట్‌మెన్ స్టిక్ ఆమె వీపుపై ఉంచి నెట్టుకుంటూ వచ్చి మెట్లమీదనుండి బయటకు ఒక్క తోపు తోశాడు. ఆ ఊపుకు చాందిని బంతిలా ఎగిరి దొర్లుకుంటూ రోడ్డువక్కన వడింది.

చీర తొడల పైదాకా లేచిపోయింది. పైట కొంగు భుజాలమీద నుండి జారి నేలమీదవడింది.

సరిగ్గా అప్పుడు పడింది గేట్‌మెన్ దృష్టి ఆమె మీద.

అంతే! ఘోరమైన అపరాధం చేసినవాడిలా పెద్దగా అరచి లోపలకు పరుగెత్తుకుంటూ వెళ్లి ప్రొప్రయిటర్‌తో "సాబ్! ఆవిడ నిజంగా చాందినీయే సాబ్!" అన్నాడు కంగారుగా.

"నీ క్కూడా పిచ్చెక్కిందా? పిచ్చి లక్ష్మికే ... ఉద్యోగంలోంచి పీకేస్తా జాగ్రత్త!" బి.పి. పెరిగి అరిచాడు ప్రొప్రయిటర్.

"నిజం సాబ్!" అంటూ అందుకు సాక్ష్యాలు చెప్పాడు.

అదిరిపడ్డాడు ప్రొప్రయిటర్. వేగంగా కదిలి బయటకు వచ్చి చూశాడు. అప్పటికే చాందిని చుట్టూ జనాలు గుంపుగా చేరారు. ట్రాఫిక్ జామ్ అయిపోయింది. వాళ్లందరినీ తోసుకుంటూ వెళ్లి చూశాడు ... అంతే! ఇందాక గేట్‌మెన్‌పై అరిచినవాడు "ఒరే! అలా వెర్రి ముఖం వేసుకు చూస్తావేమిటి? కాస్త సాయం పట్టు, అమ్మగారిని లోపలకు తీసుకెళ్దాం!" అంటూ గేట్‌మెన్ సాయంతో చాందినిని మెల్లగా షాపులోకి తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు.

కూల్‌డ్రింక్ సీసా అందించారెవరో చాందినికి.

"అమ్మా! క్షమించండమ్మా! మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను, అజ్ఞానిని ... క్షమించండి!" మోకాళ్లమీద కూర్చుని చేతులు జోడించాడు కన్నీళ్ల పర్యంతం అవుతూ.

"నన్ను కూడానమ్మా!" అంటూ వచ్చి కాళ్ల దగ్గర కూర్చుంటూ అన్నాడు బంగారు కొట్టు యజమాని.

బయట జనాలు "సూపర్ హీరోయిన్ చాందినీ, జిందాబాద్! డ్రీమ్ గర్ల్ చాందిని, బయటకు రావాలి! మాకు దర్శనభాగ్యం కలిగించాలి!" అంటూ అరుస్తున్నారు. షాపులోని జనాలు, స్టాఫ్ చాందినివంక ఆరాధనగా చూస్తున్నారు.

కూల్‌డ్రింక్ తాగి కొద్దిగా తేరుకున్న చాందిని, "మొదట నన్ను చూసి వెక్కిరించిన మీరు ఇప్పుడెందుకు గౌరవిస్తున్నారు? అవమానించిన మీరు ఇప్పుడెందుకు అభిమానిస్తున్నారు? ఇందాక గుర్తుపట్టని మీరు ఇప్పుడెలా హఠాత్తుగా గుర్తుపట్టారు? నేను ఫుల్ మేకప్‌లో ఉన్నా మీరెందుకు గుర్తుపట్టలేకపోయారు?" అంటూ విక్రమార్కుడి భుజం మీది భేతాళుడిలా ప్రశ్నల వర్షం కురిపించింది చాందిని.

"ఇందులో మీ తప్పు ఉందమ్మా! నిజంగానే ముందు మిమ్మల్ని మేము గుర్తుపట్టలేదు. మేమే కాదు, ఎవ్వరూ మిమ్మల్ని గుర్తుపట్టలేరు. ఎందుకంటే సినిమాల్లో మీ ముఖం కంటే ఎక్కువసార్లు మీ తొడలు, బొడ్డు, చంకలు, మీ ఎద సంపద, నడుం ... ఇవే చూపిస్తారు. దాంతో మాకు అవే బాగా గుర్తున్నాయి కానీ, మీ ఫేస్ మాకు గుర్తు లేదు. తప్పెవరిదో తెలియదు కానీ, ఫేస్‌లు చూపిస్తే హీరోయిన్లకు, అటు నిర్మాతలకు పైసలు రాలే కాలం పోయింది, తల్లీ! ఇదివరకు పత్రికల్లో ఓ సినిమా స్టిల్ వేసి ఇది ఏ సినిమాలో స్టిల్ ఇందులో ఉన్నవారెవరు? అనడిగేవారు. అదో పోటీ క్విజ్. తర్వాత కేవలం కళ్లు మాత్రమే వేసి, ఇవి ఏ హీరోయిన్ కళ్లు అని అడిగేవారు. అదో పోటీ క్విజ్. అదే ఇప్పుడైతే ఈ బొడ్డు, లేదా నడుం, లేదా చంకలు, లేదా ఎదసంపద ... ఎవరిది? అనే రోజులు వచ్చేశాయి. ఇందాక మీరు వచ్చినప్పుడు గుర్తుపట్టలేకపోవడానికి అదే కారణం. మిమ్మల్ని బయటకు నెట్టాక మీరు కిందపడ్డాక పైట జారిపోవడం వల్ల మీ నడుం, బొడ్డు, ఎదసంపద, చంకలు చూసి మీరు ఫలానా అని గుర్తుపట్టగలిగాం కానీ, లేకపోతే బ్రహ్మదేవుడైనా మిమ్మల్ని గుర్తుపట్టలేడు!" విక్రమార్కుడిలా జవాబిచ్చాడు.

విక్రమార్కుడి జవాబుతో సంతోషించిన భేతాళుడు తిరిగి చెట్టెక్కినట్లు తన సందేహాలు తీరిపోవడంతో తిరిగి తన కారు వద్దకు వచ్చింది చాందిని.

ఆపైన తన ఇమేజ్ ఏమాత్రం పెరిగిందో తెలుసుకోవాలనుకున్నప్పుడల్లా స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని బయటకు రావడం ప్రారంభించింది చాందిని.

■

